

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**ఆజ్ నహీతో కల్ బిఖర్ జాయేంగే యే బాదల్**

**హస్తే హువే చలే, మెరే మన్ హస్తా హువే చల్**

**బీతీ హుయీ బాతోంపే, అబ్ రోనే సే క్యా ఫల్**

**హస్తె హువే చల్, మెరే మన్ హస్తే హువే చల్...**

హిందీ సినీ గీతాలలో జీవితంపై ఆశాభావాన్ని కలిగించి, ఎలాంటి పరిస్థితులనయినా తట్టుకుని ముందుకు సాగమని ప్రభోదించే స్ఫూర్తిమంతమయిన గీతాలెన్నో ఉన్నాయి. జీవితంలో సుఖదుఃఖాలను సమంగా తీసుకుని సుఖానికి పొంగక, దుఃఖానికి క్రుంగక ముందుగు సాగుతూనే ఉండాలని ప్రబోధించే గీతాలెన్నో ఉన్నాయి. కానీ ఇలాంటి గీతం ఇంకోటి లేదు. ముఖ్యంగా, విచక్షణ మరచి, మంచి చెడు తెలియక క్షణికావేశాలకు లోనవటమే గొప్పతనం అని భ్రమపడుతున్న ఆధునిక యుగంలో ఇలాంటి పాట ప్రతిరోజూ ఇంటింటా మ్రోగాల్సిన సుప్రభాత గీతంలాంటిది.

1950లో విడుదలయిన 'మషాల్' సినిమాలోనిది ఈ పాట. కవి ప్రదీప్ రచించగా ఎస్డీ బర్మన్ స్వరాలు కూర్చిన పాట ఇది. లతా మంగేష్కర్ తనదైన ప్రత్యేక గాన సంవిధానాన్ని ఏర్పరచుకుంటున్న సమయంలో పాడినపాట ఇది. బకించంద్ర ఛటర్జీ రచించిన 'రజనీ' నవల ఆధారంగా రూపొందిన సినిమా ఇది.

అశోక్ కుమార్, సుమిత్రాదేవిల నడుమ బాల్యం నుంచి ప్రేమ ఉంటుంది కానీ తండ్రి ఒత్తిడికి లొంగి సుమిత్రాదేవి ఓ జమిందారును వివాహం చేసుకుంటుంది. దాంతో మనసు విరిగిన అశోక్ కుమార్ ఊరు వదలి వెళ్తాడు. కానీ, సుమిత్రా దేవి తనను మోసం చేసిందన్న కసితో రగులుతూంటాడు. అవకాశం దొరకగానే ఆమెను ఇబ్బందుల్లోకి నెడతాడు. ఈ కథలో, తన ప్రియుడిని కాదని తండ్రి చూపించిన వ్యక్తిని వివాహమాడిన సందర్భంలో వస్తుంది ఈ పాట. ఆమె తన ప్రేమను అణచిపెట్టుకుని కర్తవ్యాన్ని నిర్వహించాలని తనకు తాను ధైర్యం చెప్పుకుంటుందీ పాట ద్వారా. ఈ పాట

గొప్పతనం కవి ప్రదీప్ పాట ద్వారా ప్రదర్శించిన భావంలో ఉంది. పరిస్థితులతో రాజీ పడటం వ్యక్తిత్వానికి కఠినమైన పరీక్ష తప్ప అది పరాజయం, లొంగుబాటు కాదని నిరూపిస్తూ కర్తవ్యం, ధర్మం ముందు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు తృణప్రాయంగా భావించటమే అసలు వ్యక్తిత్వానికి నిదర్శనం అన్న నిజాన్ని నిరూపిస్తుంది. నాయిక ఒకరిని ప్రేమించింది, మరొకరిని వివాహమాడింది. కానీ ఆమె కృంగిపోవటం లేదు. విషాదంలో వూగి పోవటంలేదు. నిరాశలో మగ్గిపోవటంలేదు. కన్నీళ్ల ప్రవాహంలో జరగని దానిగురించి ఆలోచిస్తూ ఏడుస్తూ కూర్చోవటం వల్ల ఎలాంటి లాభం లేదు. కాబట్టి, జరిగినదాన్ని మరచిపోయి నవ్వుతూ ముందుకు సాగటమే ఉత్తమం. ఎందుకంటే, ఆకాశాన్ని కప్పేసిన మేఘాలు ఎల్లకాలమూ ఉండవు. ఇవాళ కాకపోతే రేపయినా అవి చెదరిపోక తప్పదు. కాబట్టి, తాత్కాలికంగా కమ్మేసిన మేఘాలను చూసి బెదిరిపోయి లాభంలేదు. నవ్వుతూ ముందుకు సాగటమే కర్తవ్యం

అత్యంత ప్రేరణాత్మకమయిన భావం. ఇదే సమయంలో నాయకుడు విషాదంలో మునిగి, గతాన్ని తలచుకుంటూ కుములుతూంటాడు.

**జబ్ 'తుం థె హమారె ఔర్ హం థె తుమ్హారే**

**వో థోడేసే దిన్ థె కితనె ప్యారే**

**జో హం నె తుమ్హారే సంగ్ గుజారే**

**వో థోడేసే దిన్ థె కితనె ప్యారే**

స్త్రీ పురుషుల మనస్తత్వాలలో తేడాను స్పష్టంగా చూపుతాయి ఈ రెండు పాటలు. నువ్వు నేను కలసి ఉన్న రోజులు, కొన్ని రోజులే అయినా ఎంతో ప్రియమైనవి. నీతో కలసి గడిపినది కొన్ని రోజులయినా అవి ఎంతో ప్రియమైనవి అంటున్నాడు నాయకుడు. గడచిన రోజులను మరచి నవ్వుతూ ముందుకు సాగమని తన మనస్సుకు చెప్పుకుంటున్నది నాయిక. నాయకుడు గతం జ్ఞాపకాలలో మగ్గుతున్నాడు. నాయిక గతం మరచి ముందుకు సాగుతోంది.

హిందీ సినీ గేయ ప్రపచంలో కవి ప్రదీప్ ఒక అద్భుతమైన గేయ రచయిత. భారతీయ ధర్మంపైన, జీవన విధానం పైన అత్యంత ప్రేమాభిమానాలు, గౌరవం కలవాడాయన. ఆయన రచనా శైలి కూడా సరళం. శుద్ధ హిందీ పదాలను అధికంగా వాడతాడు. అవసరమైన సందర్భాంలో అలవాటయిన ఉర్దూ పదాలను అలవోకగా వాడతాడు. అత్యంత

తాత్వికమైన గీతాలు రాశాడు. ఆలోచనాత్మకమైన గీతాలు రాశాడు. సుందరమైన శృంగార గీతాలు రచించాడు. శుద్ధమైన హిందీ పదాలను, అత్యంత సుకుమారమైన పదాలను అతి సున్నితంగా వాడుతూ అద్భుతమైన భావాలను ప్రకటిస్తాడు.

ఆ కాలంలో వివాహ వ్యవస్థ ఇంకా పటిష్టంగా ఉన్న కాలంలో, ఒక పద్ధతి ప్రకారం ప్రేమలేని పెళ్లిని విమర్శిస్తూ, ప్రేమ పెళ్లిళ్లను సమర్ధిస్తూ, తమ స్వార్ధం కోసం తల్లిదండ్రులను ఎదిరించి, సమాజాన్ని ధిక్కరించటమే 'హీరోయిజం' అన్న ఆలోచనలు అప్పుడప్పుడే పొడచూపుతున్నాయి. ఆధునికులుగా గుర్తింపు పొందాలనుకునేవారికీ, సంప్రదాయాన్ని సమర్ధిస్తూ వైవాహిక వ్యవస్థలోని ఔన్నత్యాన్ని ప్రదర్శిస్తూ, మానవ సంబంధాలలోని సున్నితత్వాన్ని ధర్మాన్ని పాటించటంలోని ఔచిత్యాన్ని ప్రదర్శించాలనుకునే వారికీ నడుమ ప్రచ్ఛన్న యుద్ధం సాగుతున్న కాలం అది. కవి ప్రదీప్ సాంప్రదాయ వాది. అందుకే ఇంత గొప్పగా పాట రాయగలిగాడు.

ఒక మహిళ మారిన పరిస్థితులకు అనుగుణంగా మారగలిగినట్టు పురుషుడు మారలేడు. ముఖ్యంగా అతని 'అహం' అతడిని మారిన పరిస్థితులను గ్రహించి అందుకు తగ్గట్టు మారేందుకు అడ్డుపడుతుంది. ఇది ఈ రెండూ పాటలు అతి చక్కగా ప్రదర్శిస్తాయి. ఆమె గతం మరచి ముందుకు సాగుతోంది. అతడు ఇంకా గతాన్ని తలచుకుని ఆ జ్ఞాపకాలలోనే బ్రతుకుతున్నాడు.

**గుజర్ చుకా హై జో జమానా, తూ భూల్ జా ఉస్ కీ ధున్**

**జో ఆనే వాలే దిన్ హై, ఉన్‌కీ ఆవాజ్ కో సున్**

**ముఝే పతాహై బడే బడే తూఫాన్ హై తేరే సామ్నే**

**ఖుషీ ఖుషీ తూ సహతా , జో కుచ్‌భీ దియాహై రాం నే**

**అప్నీ తర్హా కిత్నోంకె యహా టూట్ చుకెహై మహల్**

**హస్తె హువే వ్ చల్, మెరే మన్ హస్తే హువే చల్.**

ప్రేమించిన వాడితో పెళ్లి కాలేదని ఏడుస్తూ కూర్చునే బదులు, గతాన్ని మరచి భవిష్యత్తుపై దృష్టి పెట్టమని తన మనస్సుకు చెప్పుకుంటోంది. దేవుడు ఎలాంటి కష్టాలను ఇచ్చినా సంతోషంగా భరించమని తనకు తాను చెప్పుకుంటోంది. భవిష్యత్తులో ఎన్నో తుఫానులను తాను ఎదుర్కోవాలని ఆమెకు తెలుసు. ఎన్నో కష్టాలు పొంచి ఉన్నాయనీ తెలుసు. కానీ

అదంతా భగవంతుడు తనకు ఇచ్చిన ప్రసాదంలా భావించి సంతోషంగా అనుభవించాలని మనసును దిటవు చేసుకుంటోంది. తన కలల భవంతి కూలిపోయిందని బాధపడాల్సిన పని లేదంటోంది. ఎందుకంటే, తనకులాగే ఎందరి కలల భవంతులో కూలిపోయాయి. కాబట్టి కూలిన దాన్ని తలచుకుని బాధపడే కన్నా, భగవంతుడిపై విశ్వాసం ఉంచి, భవిష్యత్తును ధైర్యంగా, సంతోషంగా ఎదుర్కొనేందుకు మనస్సును సిద్ధం చేసుకుంటోంది.

అనుకున్నది లభించకపోయినా, లభించిన దానితో సంతృప్తి పడుతూ, దాన్నే మరింత మెరుగు పరచుకోవాలనుకునే ఒక వాంఛనీయమైన, పాజిటివ్ దృక్కోణాన్ని ప్రదర్శిస్తోంది నాయిక. తరువాత కాలంలో వచ్చిన సినిమాల్లో నాయిక పెళ్లి వద్దని ఇల్లు వదిలి పారిపోవటం, మొగుడ్ని వదలి వెళ్లిపోవటం, ప్రేమికులిద్దరూ అందరినీ వదలి పారిపోవటం, అదేదో గొప్ప విషయం అన్నట్టు చూపటం ఆనవాయితీ అయిపోయింది. 'ప్రేమ' అనేది కర్తవ్యం, ధర్మం అన్న భావనలు పోయి అదొక 'ఆట' అయిపోయింది. భవిష్యత్తులో జరిగే ఇలాంటి విచ్ఛిన్నకరమైన అభ్యుదయ భావ ప్రచారానికి అడ్డుకట్ట వేస్తూ, జీవితంలో ఏది లభిస్తే, దాన్ని భగవద్దత్తంగా భావించి సంతోషంగా ముందుకు సాగాలన్న భావనను ప్రదర్శించాడు కవి ప్రదీప్. నిజానికి అనేక మానసిక సమస్యలకు విరుగుడు ఇలాంటి భావన. ఏదో పోయిందని, ఏదో లభించలేదని, ఏదో లేదని ఏడుస్తూ కూర్చుంటే ఉన్నది పోతుంది. నిరాశ పెరుగుతుంది. మానసిక రుగ్మతలు పొడసూపుతాయి. ఇందుకు బదులుగా ఉన్న దానితో సంతృప్తి పడి, దాన్లోనే ఆనందం వెతుక్కుంటూ, ముందుకు సాగటం ఉత్తమం. ఆధునిక సమాజంలో 'రాజీ' పడటం 'చేతకాని తనం'లా ప్రచారం కావటంతో మనిషి ఎంత ఉన్నా ఇంకేదో లేదని ఆత్రపడి శారీరక, మానసిక అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నాడు. అశాంతి అనుభవిస్తున్నాడు. అందరికీ పంచుతున్నాడు.

జాయా కర్తే థే నదీ కె కినారే

బైఠే రహతే థే బయ్యా డారే

సారీ దునియా కే సుధ్ బుధ్ బిస్ రే

గినా కర్తే థె హం రాతోంకో తారే

ఆంఖో ఆంఖోం హోతే థే ఇషారే

వో థోడేసె దిన్ థె కితనె ప్యారే

నాయకుడు ఇంకా గతంలోనే మ్రగ్గుతున్నాడు. ఆమెతో గడిపిన మధురక్షణాలను గుర్తు చేసుకుంటూ బాధపడుతున్నాడు. వారిద్దరూ నది ఒడ్డున కూర్చున్న ఘడియలు, ప్రపంచాన్ని మరచి రాత్రిళ్లు తారలను లెక్కించటం, కళ్లతో సందేశాలు పంపుకోవటం గుర్తుతెచ్చుకుని బాధ పడుతున్నాడు.

మానసిక శాస్త్రవేత్తల ప్రకారం స్త్రీకన్నా పురుషుడికి ఆత్మ న్యూనతా భావం అధికం. స్త్రీకి ఆత్మగౌరవం అధికం. దీనికితోడు పురుషుడికి ఊహలెక్కువ. స్త్రీ ప్రాక్టికల్. నిజానికి దగ్గరగా ఆలోచిస్తుంది. దాంతో ఒక స్త్రీ, తనకు దూరమయితే, పురుషుడు ఆమెను త్వరగా మరచిపోలేడు. అతడి అహం దెబ్బ తింటుంది 'కసి ' పెరుగుతుంది. 'ద్వేషం ' రగులుతుంది.

స్త్రీ పరిస్థితులతో త్వరగా రాజీపడుతుంది. రాజీ పడటం అంటే లొంగిపోవటం కాదు. పరిస్థితులను అర్థం చేసుకుని, అవగాహన చేసుకుంటుంది. మానసిక శాస్త్రం ప్రకారం, మారిన పరిస్థితులతో పాటూ మారిన వాడు ఉత్తమ వ్యక్తిత్వం కలవాడు. స్త్రీ బాధ్యతాయుతంగా ఆలోచిస్తుంది. పురుషుడు భావనల తీవ్రతకు లొంగిపోతాడు. అందుకే గతాన్ని మరచిపోలేక ముందుకు పోలేకపోతాడు. తనకు దూరమైన స్త్రీ పై ప్రతీకార వాంఛతో రగిలిపోతాడు. 'మషాల్' సినిమాలో అశోక్ కుమార్ అదే చేస్తాడు. ఆ మధ్య తనను కాదన్న స్త్రీపై ఏసిడ్ దాడులు, కత్తితో దాడులు, చంపటం వంటివి పురుషులు చేసేవారు. ఇటీవలి కాలంలో పురుషులతో సమానత్వం కోరిన తరువాత స్త్రీలు, పెళ్లి చేసుకున్న తరవాత మొగుడిని చంపేయటం, నరికి పోగులు పెట్టటం, విషం ఇవ్వటం చేస్తున్నారు. దీనంతటికీ కారణం, మన ఆధునిక అభ్యుదయ సమాజం పురుషుడిని పురుషుడిగా, స్త్రీని స్త్రీగా ఉండనివ్వకపోవటం. స్త్రీని పురుషుడిలా మార్చాలని తపన పడటం. అదే అభ్యుదయం, అదే ప్రగతి అని సమాజాన్ని, స్త్రీలను నమ్మించటం. ఇందులోని అనర్థాన్ని గ్రహించిన ఆనాటి కవులు స్త్రీని పురుషుడిలా మార్చటం కన్నా స్త్రీ ఆత్మబలాన్ని, ఆత్మ గౌరవాన్ని ఉద్దీపితం చేయటం కోసం ప్రయత్నించారు. స్త్రీ పురుషుడిలా మారటం కాదు, స్త్రీ, స్త్రీలా ఉండటమే అసలయిన అభ్యుదయం అన్న భావనను తమ గీతాల ద్వారా ప్రదర్శించారు. స్త్రీని పురుషుడితో సమానం చేయాలంటే, ఆమెని ఎన్నో మెట్లు క్రిందకు దించాలని వారికి తెలుసు. పురుషుడు పశువు. ఆ పశువును మనిషి చేసేది స్త్రీ. ఎప్పుడయితే పశువును మనిషిగా ఎదిగించాల్సినవారే పశువుగా అయ్యేందుకు పోరాటం చేస్తారో, అప్పుడు సమాజంలో ఎలాంటి అశాంతి, మానసిక దౌర్బల్యాలు నెలకొంటాయో ప్రస్తుతం మనం అనుభవిస్తున్నాం. అందుకే ఆమెని ఉన్నత స్థానపై ఉంచారు తప్ప క్రిందకు దించాలని ప్రయత్నించలేదు.

**పూలోంకా సెహరా బంధ్వాలే ఇస్ దునియామే అనేక్**

**జో కాటోంకా తాజ్ పహన్ తే వో లాఖోమే ఏక్**

**మేరే మన్ వో లాఖోమే ఏక్**

**గిరే బిజ్‌లియా ఫిర్‌భీ అప్‌నీ టేక్ సే తూ మత్ టల్**

**హస్తే హువే చల్, మెరే మన్ హస్తె హువే చల్.**

ఎందరి జీవితాల్లోనో పూలబాటలుంటాయి. కానీ ముళ్ల కిరీటం ధరించేవారు లక్షల్లో ఒకరుంటారు. పిడుగులు కురిసినా, మెరుపులు మెరిసినా నీ పట్టుదల వదలకు. నవ్వుతూ ముందుకు సాగు. ఇదీ వ్యక్తిత్వం.

వ్యక్తులలో ప్రేమ రాహిత్య భావనను రగిలించటం సులభం. మనిషి సంతృప్తి చెందటంకన్నా అసంతృప్తితో అలమటించేందుకే ఇష్టపడతాడు. సుఖం కోరతాడు. కానీ విషాదంలో ఆనందిస్తాడు. ఇది తెలిసిన నాయిక కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్న వాడే మనిషి అని స్పష్టం చేస్తోంది. తన భర్తను సంపూర్ణంగా ప్రేమించటం ఆమె కర్తవ్యం. అది ధర్మం. పిడుగులు పడినా, తుఫానులొచ్చినా తన ధర్మం నుంచి ఇసుమంతయినా కదలవద్దని తన మనస్సుకు చెప్పుకుంటోంది. ఈ పాట వింటూంటే, 'ఏకవీర ' నవలలో 'చరైవేతి' గుర్తుకు వస్తుంది. ధర్మ పాలన అత్యున్నత కర్తవ్యం.

మేరీ మొహబ్బత్ ఆగ్ జలానా సంభల్ కే జరా చిరాగ్

మై కాగజ్ కే ఘర్ మే బైరీ లగ్ న జాయే ఆగ్

**మేరీ కిస్మత్ మే లగ్ న జాయే ఆగ్,**

**లగ్‌న జాయే దాగ్ మేరీ ఇజ్జిత్‌కె**

**ఇస్ దేశ్‌కీ నారీకో కోయీ కహన దే దుర్బల్**

**హస్తె హువే చల్, మెరే మన్ హస్తె హువే చల్.**

'అద్భుతం' అనిపిస్తుంది చివరి చరణం. ఈ పాట వింటున్నంతసేపూ మనసు 'చరైవేతి' అంటూనే ఉంటుంది. ఐతరేయ బ్రాహ్మణం 'చరైవేతి, చరైవేతి' అంటుంది. జ్ఞానం సంపాదించటంలో ధర్మ మార్గంలో ముందుకు ప్రయాణించమంటుంది. ఇక్కడ కవి ప్రదీప్ కూడా ముందుకు నవ్వుతూ పొమ్మంటున్నాడు.

ఆమె ప్రేమ భగ్నం అయింది. కానీ ఆమె అందుకు దుఃఖించడంలేదు. భగ్నమైన ప్రేమ బాష్పకణాలు అగ్ని కణాలై కాగితపు ఇంట్లో ఉంటున్నట్టున్న ఆమె సున్నితమైన పరిస్థితిలో నిప్పులు కురిపిస్తుందేమోనని భయపడుతోంది. కాగితపు ఇల్లు సులభంగా బూడిదయిపోతుంది. అందుకే ప్రేమ దీపాన్ని జాగ్రత్తగా వెలిగించమంటోంది. ఇప్పుడు ఆమె గతంలోని ప్రేమను తలచుకుంటే అది ఆమె కర్తవ్య నిర్వహణకు అడ్డురావచ్చు. ధర్మపాలనకు ప్రతిబంధకం కావచ్చు. కాబట్టి ఆ విషయాలతో జాగ్రత్తగా వ్యవహరించమని మనసుకు చెప్పుకుంటోంది. లేకపోతే, వెలుతురునివ్వాల్సిన దీపం ఇంటిని కాల్చేస్తుంది. ఆమె అదృష్టం ఆవిరైపోతుంది. ఆమె గౌరవనికి కళంకం అంటుతుంది. ఆ బలహీనతను దరి రానీయవద్దంటోంది. లేకపోతే, ఈ ఒక్క బలహీనతను చూపి భారతీయ నారి దుర్బల అని ప్రచారం చేస్తారు. గౌరవాన్ని దెబ్బ తీస్తారు. 'ఇస్ దేశ్ కె నారీ కో కోయీ న కహే దుర్బత్'. కాబట్టి ఆ అవకాశం ఇవ్వకుండా ఆత్మ గౌరవాన్ని నిలుపుకుంటూ దేశగౌరవాన్ని కాపాడుతు, భారతీయ నారి దుర్బల కాదు సబల అని నిరూపిస్తూ ముందుకు సాగమని తన మనస్సుకు చెప్పుకుంటోంది నాయిక.

ఇక్కడ నాయిక తన ప్రేమను అణచి కర్తవ్యానికి, ధర్మానికి పెద్దపీట వేయటాన్ని, భారతీయ నారి సబల అని నిరూపించటంతో ముడి పెట్టటంలో కవి ప్రదీప్ మనస్సు తె లుస్తుంది. ధర్మపాలన, కర్తవ్యనిర్వహణ, ఆత్మగౌరవం భారతీయ నారి లక్షణాలు.

**ఔరత్ హై వొ ఔరత్ జిసె దునియాకి షరం హై**

**సంసార్ మె బస్ లాజ్ హి నారీ క ధరంహై.**

'లాజ్ ' అంటే శీలం. సచ్ఛీలం నారీ ధర్మం. మిగతావన్నీ తరువాత. అన్నిటికన్నా ప్రధానం ఆత్మగౌరవం.

ఈనాడు అన్ని బంధనాలు తెంచుకున్న ఆధునిక మహిళ, అన్ని సరిహద్దులూ తుడిచి వేసున్న ఆధునిక మహిళ కన్నా ఎక్కువ గౌరవం, అభిమానం, ఆప్యాయత, ప్రేమలు ఆనాటి మహిళ అనుభవించింది. ఈనాడు 'స్వేచ్ఛ ' పేరిట 'అసహనం' అలంకారమై, స్త్రీ, తనని తాను అందమైన బొమ్మగా, అందాల గనిగా, పురుషుడిని ఆకర్షించి, సంతృప్తి పరచటమే జీవిత లక్ష్యంలా భావిస్తూ, ఎంత స్వేచ్ఛగా ప్రవర్తిస్తే అంత అసంతృప్తికీ, నిరాశకూ గురువు తూ మానసిక రుగ్మతల బారిన పడుతూ 'ఆత్మహత్య', లేకపోతే నిరాశతో శిధిలమై జీవచ్ఛవంలా గడపటం చూస్తుంటే 'చరైవేతి, చరైవేతి ' అంటూ ఈ పాటను వినిపించాలనిపిస్తుంది. సంతృప్తిని మించిన సౌఖ్యం, ఆత్మగౌరవాన్ని మించిన లక్ష్యం మరొకటి లేదనిపిస్తుంది. 'ప్రేమ' అనే మృగతృష్ణ వెంట పడుతూ జీవించటం మరచిన వారికి జీవించటం

నేర్పించాలనిపిస్తుంది. జీవితంలో రాజీ ప్రాధాన్యం బోధించాలనిపిస్తుంది. జీవితం ఒక పోరాటమైనా, విచక్షణ రహితమైన పోరాటాల వల్ల అనర్థం, అశాంతి, అవమానం, వినాశనం తప్ప మరొకటి లభించదని వివరించాలనిపిస్తుంది. దేనితో పోరాడాలి, ఎందుకు పోరాడాలి, ఎలా పోరాడాలి అన్న విచక్షణ లేని పోరాటం వ్యర్థం అని చెప్పాలనిపిస్తుంది. అదేమీ చేయలేనప్పుడు 'ఇస్ దేశ్‌కి నారీ కో కోయీ న కహ దే దుర్బల్' అన్న విధంగా ఆత్మ గౌరవాన్ని నిలుపుకోమని ఈ పాటను వినిపించాలనిపిస్తుంది. భావితరాలకు మంచి మార్గాన్ని చూపించాలని తపన పడిన ఆనాటి కళాకారులకు జోహార్లర్పించాలనిపిస్తుంది. ఇప్పటి దుస్థితి ఎప్పటికీ వుండదని ఆశిస్తూ, 'ఆజ్ నహీ తో కల్ బిఖర్ జాయేగీ యే బాదల్, హస్తె హువే చల్, మెరే మన్ హస్తె హువే చల్' అని పాడుకుంటూ ముందుకు సాగాలనిపిస్తుంది.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story